AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN

పలువురు పోలీస్ అధికారుల బదిలీ

అక్షరటుడే, హైదరాబాద్ : రాష్ట్రంలో ఓ సీఐ, పలువురు ఎస్సైలు బదిలీ అయ్యారు. మొత్తం 8 మందికి స్థాన చలనం కలిగిస్తూ మల్టీ జోన్-2 ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. సూర్యాపేట డీసీఆర్‌బీలో పని చేస్తున్న సీఐ వై హరిబాబు నకిరేకల్ ఠాణా ఎస్‌హెచ్‌వోగా బదిలీ అయ్యారు. నల్గొండ సీసీఎస్‌లో పని చేస్తున్న ఎస్సై పి విష్ణు మూర్తి నార్కెట్‌పల్లికి, అక్కడ పని చేస్తున్న క్రాంతి కుమార్‌ను వీఆర్‌కు అటాచ్ చేశారు. చండూర్ ఎస్సై వెంకన్నను గుర్రంపోడు పోలీస్ స్టేషన్‌కు, అక్కడ ఉన్న పి మధును వీఆర్‌కు అటాచ్ చేశారు. నల్గొండ సీసీఎస్‌లో పని చేస్తున్న శివకుమార్‌ను చండూర్ ఠాణాకు, వీఆర్‌లో ఉన్న సైదులును నల్గొండ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు పంపించారు. భువనగిరి సీసీఎస్‌లో ఉన్న టి లింగారెడ్డిని అదే జిల్లాలోని రాజంపేట ఠాణాకు బదిలీ చేశారు.

అజిత్ పవార్ మృతిపై మమతా బెనర్జీ అనుమానాలు

అక్షరటుడే, నేషనల్ డెస్క్ : మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ మృతిపై పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. మమత బెనర్జీ మీడియాతో మాట్లాడుతూ.. పవార్ మరణ వార్త తనను షాక్‌కు గురి చేసిందన్నారు. ఈ సంఘటన దేశానికి తీవ్ర నష్టంగా అభివర్ణించారు. రాజకీయ నాయకులకు కూడా భద్రత లేదని ఆమె అన్నారు. పవార్ బీజేపీని వీడాలని ఆలోచిస్తున్నట్లు సోషల్ మీడియాలో ఇటీవల ప్రసారం అయిన ప్రకటనలను ఆమె ప్రస్తావించారు. ఈ ఘటనపై అనేక ప్రశ్నలు ఉన్నాయని పేర్కొన్నారు. దీనిపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు మాత్రమే విశ్వసనీయంగా ఉంటుందని అన్నారు.

28-1-2026 (Wednesday) MAIN EDITION

దానం నాగేందర్‌కు స్పీకర్ నోటీసులు

అక్షరటుడే, హైదరాబాద్ : ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు స్పీకర్ ప్రసాద్ నోటీసులు జారీ చేశారు. ఆయన అనర్హత పిటిషన్ పెండింగ్‌లో ఉంది. దీనిపై ఈ నెల 30లోపు విచారణకు రావాలని స్పీకర్ ఆదేశించారు. అనర్హత పిటిషన్లపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఇటీవల సుప్రీంకోర్టు హెచ్చరించిన విషయం తెలిసిందే.

జనసేన ఎమ్మెల్యే ఘటనపై విచారణ కమిటీ

అక్షరటుడే, ఏపీ : రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ న్యూడ్ వీడియో కాల్ ఘటనపై జనసేన స్పందించింది. ఆయనపై ఓ మహిళ ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై పార్టీ విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. నిజానిజాలు విచారణ చేసి కమిటీ నివేదిక అందించిన తర్వాత తుదినిర్ణయం వెల్లడిస్తామని పేర్కొంది.

మొదలైన నామినేషన్ల సందడి

అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడంతో పట్టణాల్లో సందడి మొదలైంది. బుధవారం తొలిరోజు పలువురు నామినేషన్లు దాఖలు చేశారు. ఇంకా టికెట్లు ఖరారు కాకపోవడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్లు సమర్పించలేదు. గురువారం నుంచి భారీగా నామినేషన్లు దాఖలు అయ్యే అవకాశం ఉంది.

రూ.4 లక్షలకు చేరిన వెండి

అక్షరటుడే, బిజినెస్ డెస్క్ : బంగారం, వెండి ధరల పరుగు ఆగడం లేదు. రాకెట్ వేగంతో రేట్లు దూసుకెళ్తుండటంతో సామాన్య ప్రజలు కొనలేని పరిస్థితి నెలకొంది. బుధవారం ఏకంగా పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.3,220 పెరిగి 1,65,170కి చేరింది. 22 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.2,950 పెరగడంతో రూ.1,51,400 పలుకుతోంది. కిలో వెండి రూ.13 వేలు పెరగడంతో రూ.4 లక్షలకు చేరింది. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కళ్ల ముందే రేట్లు దూసుకు పోతుండటంతో కొనుగోలు చేసేది ఎలా అని ఆలోచిస్తున్నారు. అంతర్జాతీయ అనిశ్చితులు, ఆర్థిక పరిస్థితులతో బంగారం, వెండి ధరలు భారీగా పెరుగుతున్నాయి. రేట్లు పెరగడంతో గిరాకీలు బాగా తగ్గాయని వ్యాపారులు అంటున్నారు.

రెవెన్యూ వ్యవస్థలో మార్పులు : మంత్రి

అక్షరటుడే, సంగారెడ్డి: రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులు తెస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రజలకు వేగంగా, పారదర్శకంగా సేవలు అందించడానికి ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు కర్ధనూర్‌లో సమీకృత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి పాల్గొన్నారు.

అమెరికాలో తెలంగాణవాసి మృతి

అక్షరటుడే, నేషనల్ డెస్క్: అమెరికాలో తెలంగాణకు చెందిన వ్యక్తి మృతి చెందాడు. వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం బొల్లారం గ్రామానికి చెందిన హర్షవర్ధన్‌రెడ్డి (45) ఫ్లోరిడాలో ఉంటున్నాడు. ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఆయన పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి వర్క్ ఫ్రమ్ హోం చేస్తుండగా గుండెపోటుతో కుప్పకూలాడు. హర్షవర్ధన్‌రెడ్డి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అజిత్ పవార్ దుర్మరణం

▶ కూలిపోయిన డిప్యూటీ సీఎం విమానం ▶ ప్రమాదంలో ఐదుగురి మృతి ▶ మహారాష్ట్రలో విషాదం ▶ ప్రముఖుల దిగ్భ్రాంతి

మహారాష్ట్రలో ఘోర విషాదం చోటు చేసుకుంది. విమానం కూలిపోయి ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ మృతి చెందారు. ఎన్నికల ప్రచారానికి వెళ్తున్న సమయంలో విమానంలో సాంకేతిక సమస్య తలెత్తగా అత్యవసరంగా ల్యాండింగ్ చేస్తుండగా కూలిపోయింది. ఈ ఘటనలో పవార్‌తో సహా ఐదుగురు మృతి చెందారు. దీంతో మహారాష్ట్రలో తీవ్ర విషాదం నెలకొంది. ఆయన మృతిపై ప్రధాని, రాష్ట్రపతి సహా పలువురు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

అజిత్ పవార్ ప్రయాణిస్తున్న విమానం బుధవారం ఉదయం బారామతిలో కుప్పకూలింది. ఈ ఘటనలో పవార్‌తో పాటు మరో నలుగురు సైతం చనిపోయారు. జిల్లా పరిషత్ ఎన్నికల ప్రచారం కోసం ముంబయి నుంచి పవార్ తన విమానంలో బయలు దేరారు. అయితే విమానంలో సాంకేతిక సమస్య తలెత్తినట్లు సమాచారం. దీంతో బారామతిలో అత్యవసరంగా ల్యాండింగ్ చేస్తుండగా ఉదయం 8.45 గంటల సమయంలో విమానం క్రాష్ ల్యాండ్ అయింది. దీంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. అజిత్ పవార్‌తో సహా అందులో ప్రయాణిస్తున్న ఐదుగురు చనిపోయారు.

బాబాయి అడుగుజాడల్లో..

అజిత్ పవార్ తన బాబాయి, ఎన్సీపీ వ్యవస్థాపకుడు శరద్ పవార్ అడుగు జాడల్లో రాజకీయాల్లోకి వచ్చారు. అనంతరం ఆ పార్టీనే ఆయన సొంతం చేసుకున్నారు. ఆయన 1959 జూలై 22న జన్మించారు. అజిత్ తండ్రి అనంతర్‌రావు సైతం సీనియర్ నాయకుడు. శరద్ పవార్ సోదరుడు. శరద్ పవార్ ప్రభావంతో రాజకీయాల్లోకి వచ్చినా.. అజిత్ పవార్ తర్వాత తనకంటూ ప్రత్యేక పేరు సంపాదించుకున్నారు. పశ్చిమ మహారాష్ట్రలోని అనేక ప్రాంతాలలో పార్టీ సంస్థపై, క్షేత్రస్థాయి కార్యకర్తలపై కూడా గట్టి పట్టు సంపాదించారు.

షుగర్ ఫ్యాక్టరీ బోర్డు మెంబర్‌గా..

అజిత్ పవార్ 1982లో కార్పొరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ బోర్డుకు ఎన్నికయ్యారు. అనంతరం పూణే కో ఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్‌గా వ్యవహరించారు. 1991లో మొదటి సారి బారామతి నుంచి ఎంపీగా గెలుపొందారు. అనంతరం కొద్ది రోజులకే బాబాయి శరద్ పవార్ కోసం రాజీనామా చేశారు. 1991లో అసెంబ్లీ ఎన్నికల్లో బారామతి నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. పార్టీలో అంచెలంచెలుగా ఎదిగారు. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా సుదీర్ఘ కాలం పని చేసిన వ్యక్తిగా నిలిచారు.

ప్రధాని దిగ్భ్రాంతి

అజిత్‌పవార్ మృతిపై ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా సంతాపం తెలిపారు. పవార్ ప్రజానాయకుడు, ఆయనకు క్షేత్రస్థాయిలో బలమైన సంబంధాలు ఉండేవని పేర్కొన్నారు. మహారాష్ట్ర ప్రజలకు సేవ చేయడంలో ముందుండి, కష్టపడి పనిచేసే వ్యక్తి అన్నారు. కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల సీఎంలు, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అజిత్ పవార్ మృతికి సంతాపం తెలిపారు.

రక్షణ రంగంలో దేశీయ ఉత్పత్తులను పెంచాం : రాష్ట్రపతి

అక్షరటుడే, నేషనల్ డెస్క్ : రక్షణ రంగంలో దేశీయ ఉత్పత్తులను పెంచినట్లు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. దేశీయ ఉత్పత్తి రెండున్నర లక్షల కోట్లకు చేరుకుందని పేర్కొన్నారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు బుధవారం ఉదయం ప్రారంభం అయ్యాయి. ఫిబ్రవరి 1న లోక్‌సభలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నారు. ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసగించారు. మైక్రోచిప్ రంగంలో ఆత్మ నిర్భరత అవసరముందని ఆమె పేర్కొన్నారు. సెమీ కండక్టర్ల ఉత్పత్తిని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, క్రిటికల్ మినరల్ మిషన్‌తో ఖనిజాల ఉత్పత్తికి పెద్దపీట వేస్తున్నట్లు వెల్లడించారు. వికసిత్ భారత్ లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని ముర్ము తెలిపారు. ప్రపంచంలో ధాన్యం ఉత్పత్తిలో అగ్రస్థానంలో, ఆక్వా రంగంలో రెండో స్థానంలో నిలిచామని వెల్లడించారు. ఉత్పత్తి రంగంలో అనేక సంస్కరణలు చేపట్టడంతో ఎగుమతులు పెరిగాయన్నారు. ఇన్‌కమ్ ట్యాక్స్‌లో కీలక సంస్కరణలు తెచ్చినట్లు రాష్ట్రపతి తెలిపారు. రూ.12 లక్షల వరకు ఆదాయ పన్ను మినహాయింపు కల్పించడంతో మధ్యతరగతి ప్రజలకు మేలు జరిగిందన్నారు. త్వరలో భారత్ సొంత అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయనుందన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో భారత సైనిక శక్తి ప్రపంచానికి తెలిసిందని గుర్తు చేశారు. కేంద్రం చేపట్టిన చర్యలతో మావోయిస్టుల ప్రభావం 126 జిల్లాల నుంచి 8 జిల్లాలకు తగ్గిందన్నారు.

ప్రారంభమైన మేడారం జాతర

అక్షరటుడే, ములుగు : మేడారం మహా జాతర ప్రారంభం అయింది. బుధవారం ఉదయం పడిగిద్దరాజు, గోవిందరాజు గద్దెల మీదకు చేరుకున్నారు. రాత్రి వరకు సారక్క గద్దెమీదకు రానున్నారు. జాతర ప్రారంభం కావడంతో వనమంతా జన సందడి నెలకొంది. భారీగా భక్తులు తరలి వచ్చారు. అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటున్నారు. 29న సమ్మక్క గద్దెలపైకి వస్తారు. 30న భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు. 31న దేవతలు తిరిగి వన ప్రవేశం చేయడంతో జాతర ముగియనుంది. మహా జాతరకు దాదాపు మూడు కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఆర్ఆర్‌బీలో 22 వేల గ్రూప్–డి పోస్టులు

అక్షరటుడే, ఎడ్యూకేషన్ డెస్క్ : పదో తరగతి, ఐటీఐ అర్హతలతో రైల్వేలో ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్నవారికి రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్ తీపి కబురు అందించింది. 22 వేల గ్రూప్‌డి (లెవల్ 1) పోస్టులను భర్తీ చేయడానికి భారీ నోటిఫికేషన్ విడుదల చేసింది. పాయింట్‌స్‌మన్, ట్రాక్ మెయింటెయినర్, అసిస్టెంట్, అసిస్టెంట్ లోకో షెడ్, అసిస్టెంట్ ఆపరేషన్స్ తదితర పోస్టులను భర్తీ చేయనుంది. ట్రాక్ మెయింటైనర్, పాయింట్‌స్‌మన్, అసిస్టెంట్ బ్రిడ్జ్, అసిస్టెంట్ లోకో షెడ్(ఎలక్ట్రికల్), అసిస్టెంట్ ఆపరేషన్స్, ట్రాక్ మెషిన్ అసిస్టెంట్ విభాగాల్లో నియామకాలు చేపట్టనున్నారు. సికింద్రాబాద్, చెన్నై, బెంగళూరు, ముంబయి, అహ్మదాబాద్, అజ్‌మేర్, భోపాల్, భువనేశ్వర్, బిలాస్‌పూర్, చండీగఢ్, గోరఖ్‌పుర్, కోల్‌కతా, మాల్దా, పట్నా, ప్రయాగ్‌రాజ్, రాంచీ రీజియన్లలో పోస్టులను భర్తీ చేయనున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థుల మృతి

అక్షరటుడే, హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలోని మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఓ కారు అతివేగంగా పిల్లర్‌ను ఢీకొనడంతో ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు. మౌలాలిలోని ఓ స్నేహితుడి ఇంట్లో జరిగిన ఫంక్షన్‌కు 8 మంది విద్యార్థులు వెళ్లారు. అనంతరం నిఖిల్ (22) మిగతా మిత్రులను పోచారంలో దింపడానికి వెళ్తుండగా.. ప్రమాదం జరిగింది. మేడిపల్లిలోని ఉప్పల్ నారపల్లి ఎలివేటెడ్ ఫ్లైఓవర్ పిల్లర్ నెంబర్ 97 వద్దకు రాగానే కారు అదుపు తప్పింది. దీంతో కారు పిల్లర్‌ను బలంగా ఢీకొంది. ఈ ఘటనలో కారు నుజ్జు నుజ్జు కాగా.. ఇద్దరు విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందారు. వారిని వనపర్తి జిల్లాకు చెందిన సాయి వరుణ్, నిఖిల్‌గా గుర్తించారు. వెంకట్, రాకేష్, యశ్వంత్ అనే ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. సాత్విక్, హర్షవర్ధన్, అభినవ్ అనే ముగ్గురు విద్యార్థులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

ట్రోలింగ్‌తో షూటింగ్‌కు వెళ్లలేదు



బాలీవుడ్ హీరోయిన్ భూమి పెడ్నేకర్ తనపై గతంలో వచ్చిన ట్రోలింగ్‌పై స్పందించారు. గతేడాది ఆమె నటించిన 'ది రాయల్స్' సిరీస్‌పై అనేక విమర్శలు వచ్చాయి. దీంతో తాను ఎంతో నిరుత్సాహ పడ్డట్లు భూమి చెప్పారు. మానసికంగా అలసిపోయానని, దాదాపు 9 నెలల పాటు షూటింగ్‌కు వెళ్లలేదన్నారు. తాజాగా ఆమె నటించిన 'దల్దాల్' సిరీస్ ఈ నెల 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ క్రమంలో ఆమె పలు విషయాలు అభిమానులతో పంచుకున్నారు. ఈ క్రైమ్ థ్రిల్లర్‌లో డీసీపీ పాత్రలో భూమి నటిస్తున్నారు.

- అక్షరటుడే, సినిమాడెస్క్

తల్లిదండ్రులను చంపిన కూతురు

అక్షరటుడే, వికారాబాద్ : వికారాబాద్ జిల్లా బంట్వారం మండలం యాచారం గ్రామంలో దారుణం చోటు చేసుకుంది. ఓ యువతి ప్రేమ వివాహానికి అడ్డు వస్తున్నారని చెప్పి తల్లిదండ్రులను హత్య చేసింది. గ్రామానికి చెందిన దశరథ్, లక్ష్మి దంపతులు. వీరికి ఒక కుమారుడు అశోక్, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. చిన్న కుమార్తె సురేఖ సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా పని చేస్తోంది. ఆమె అక్కడ ఓ యువకుడితో ప్రేమలో పడింది. అయితే తమ పెళ్లికి తల్లిదండ్రులు అడ్డు వస్తున్నారని కోపం పెంచుకుంది. ఈ క్రమంలో నిద్రలో ఉన్న తల్లిదండ్రులకు విషపూరిత ఇంజెక్షన్ ఇచ్చి హత్య చేసింది.